ఆగని చోరీలు.. ప్రజల బెంబేలు

- ఇళ్లు, దేవాలయాలే లక్ష్యంగా..
- మహిళల మెడల్లో గొలుసుల అపహరణ
- విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల దొంగతనాలు



హుండీలో నగదును తస్కరించి.. ఆపై పడేసి



ఇంటి కిటికీ గ్రిల్స్‌ను తొలగించిన ఆగంతకులు (ఫైల్)

పొదలకూరు: మండలంలో జరుగుతున్న వరుస చోరీలతో ప్రజలకు కునుకు కరువవుతోంది. ఇళ్లు, దేవాలయాలే లక్ష్యంగా చేసుకొని ఆగంతకులు చెలరేగిపోతున్నారు. మరోవైపు నగరాలకే పరిమితమైన చైన్ స్నాచింగ్‌లు ఇక్కడికీ పాకాయి. ఈ తరుణంలో బయటకు వెళ్లాలంటేనే మహిళలు జంకాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.

వామ్మో..

- పట్టణంలోని తొగటవీధిలో చిన్న బంకును పెట్టుకొని వ్యాపారం చేసుకుంటున్న వృద్ధురాలు ఆదెమ్మ షాపు వద్దకు తరచూ వచ్చే యువకుడు.. ఆమె మెడలోని సరుడును గతేడాదిలో మధ్యాహ్నం లాక్కెళ్లాడు.
- నాగార్జున స్కూల్ వీధిలో ఓ మహిళ తన పిల్లలను పాఠశాల నుంచి ఇంటికి తీసుకొచ్చేందుకు ఒంటరిగా వెళ్తుండగా, ఓ ఆగంతకుడు బైక్‌పై వచ్చి మెడలోని బంగారు గొలుసును తెంపుకెళ్లాడు.
- తాజాగా పట్టణానికి కూతవేటు దూరంలోని సోమశిల మార్గంలో ఉండే నరసింహకండ్రిక మెయిన్ రోడ్డు వద్ద ప్రావిజన్స్ షాపును నిర్వహిస్తున్న మహిళ వద్దకెళ్లి వస్తువులను కొనుగోలు చేస్తున్నట్లు నటిస్తూ ఆమె మెడలోని విలువైన బంగారు సరుడును ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు లాక్కెళ్లారు. ఇలాంటి ఘటనలు చాలానే జరిగినా, పోలీసులు ఛేదించింది మాత్రం ఒకట్రెండే. మహిళలు సైతం ప్రాథమిక జాగ్రత్తలు పాటించకపోవడంతో స్నాచర్లు తమ పనిని కానిచ్చేస్తున్నారు.

భయం..భయం

పట్టణం, చుట్టుపక్కల ప్రాంతాల్లో ఈ ఏడాది ఏప్రిల్ నుంచి వరుస దొంగతనాలు జరుగుతూనే ఉన్నాయి. పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్లో ప్రభాకర్, కుటుంబసభ్యులు ఇంట్లో లేని సమయంలో భారీగా నగలు, నగదును ఏప్రిల్ తొమ్మిది చోరీ చేశారు. ఇంటి తలుపును గడ్డపారతో పెకలించి చోరీకి పాల్పడ్డారు. అదే రోజున కాకుమాని లే అవుట్లో అల్లాబక్షు ఇంట్లో ఎవరూ లేని సమయంలో కిటికీ గ్రిల్స్‌ను ఊడగొట్టి బంగారు నగలను అపహరించారు. అదే రోజు రాత్రి పట్టణంలోని నిమ్మ మార్కెట్ యార్డు సమీపంలో గల వినాయక దేవస్థానంలోకి కొందరు యువకులు ప్రవేశించి పూజా సామగ్రిని చోరీ చేశారు. ఈ వ్యవహారం సీసీ కెమెరాల్లో నిక్షిప్తమైంది. పట్టణంలోని బస్టాండ్‌లో ఓ రైతు బ్యాంక్ నుంచి రూ.80 వేలను తీసుకెళ్లే క్రమంలో బైక్ ట్యాంక్ కవర్లో పెట్టుకొని ఉండగా, ఓ గుర్తుతెలియని యువకుడు తస్కరించాడు. పారిపోతుండగా స్థానికులు వెంబడించడంతో ఓ ఇంట్లో నగదును పడేసి వెళ్లారు. అయితే సదరు ఇంటి యజమాని నిజాయతీగా పోలీసులకు అప్పగించారు.

ఐదు ఆలయాల్లో వరుసగా..

మొగళ్లూరులో జూలై 15వ తేదీ అర్ధరాత్రి వరుసగా ఐదు దేవాలయాల్లో చోరీలు జరిగాయి. ఎస్సీ కాలనీలో రెండు.. గ్రామంలోని మూడు దేవాలయాల్లో చోరీ చేశారు. ఇప్పటి వరకు వీరిని గుర్తించలేకపోయారని గ్రామస్తులు వాపోతున్నారు. భక్తులు చందాలు వేసుకొని బంగారు వస్తువులను సమకూర్చారు. హుండీలను సైతం ఎత్తుకెళ్లి పగలగొట్టి నగదును తీసుకొని చెరువు వద్ద పడేసి వెళ్లారు.

రాగి తీగలనూ వదలడంలేదు

మండలంలోని మర్రిపల్లి, ఆల్తుర్తి, కనుపర్తి, మొగళ్లూరు, ముదిగేడు, దేగపూడి తదితర గ్రామాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల చోరీలు గతేడాది నుంచి అధికమయ్యాయి. వీటిని పగలగొట్టి అందులోని రాగి తీగను తస్కరిస్తున్నారు.

క్లుప్తంగా

ఆత్మ విశ్వాసంతోనే లక్ష్య సాధన



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అతిథులు

నెల్లూరు(బారకాసు): గిరిజన యువత ఆత్మ విశ్వాసంతో కష్టపడితే లక్ష్య సాధన సాధ్యమని ఫాల్కన్ సిటీ మాజీ డిప్యూటీ మేయర్ చలంచర్ల ఏడుకొండలు అన్నారు. గిరిపుత్ర ఫౌండేషన్, యానాది హెల్త్ అండ్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో ఉపాధి కల్పన అవకాశాలపై స్థానిక బీవీనగర్‌లోని గిరిజన భవన్‌లో అవగాహన సదస్సును ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా అమెరికాలోని ఫాల్కన్ సిటీ మాజీ డిప్యూటీ మేయర్ పాల్గొని, మాట్లాడారు. గిరిజన యువత పట్టుదలతో చదువుకోవాలని, వృత్తివిద్యలో నైపుణ్యం పెంచుకోవాలని ఆకాంక్షించారు. ఫౌండేషన్ నిర్వాహకులు స్రవంతి జయవర్ధన్, పొట్లూరి శ్రీనివాసులు మాట్లాడుతూ అన్నిరంగాల్లో గిరిజన యువత రాణించాలన్నారు. కార్యక్రమంలో యాకసిరి వెంకటేశ్వర్లు, బాపట్ల వేంకటపతి, పులి చెంచయ్య, వేటగిరి సుధాకర్‌రావు, ఈగ రామయ్య, ఎల్లంపల్లి కృష్ణకుమారి, చేవూరు శ్రీనివాసులు, గంధళ్ల శ్రీరాములు, మోపూరు వెంకటేశ్వర్లు, ఆదిశేషయ్య, జయభారతి హాస్పిటల్ జనరల్ మేనేజర్ మారెళ్ల గురుప్రసాద్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గంధ మహోత్సవం



నెల్లూరు(బృందావనం): జెండావీధి కోటమిట్టలో ఉన్న కంతర్షావలీ దర్గాలో గంధ మహోత్సవాన్ని ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దర్గా సాహెబ్ ముస్తాఖ్ ఆధ్వర్యంలో గంధం సమర్పించారు. ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కమిషన్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ ఇంతియాజ్ అన్నదానం చేశారు. నిర్వాహకులు రసూల్, మజాహర్, జాకీర్, రవూఫ్ తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాప్టో ధర్నాను విజయవంతం చేయాలి



జిల్లా కార్యవర్గ సమావేశంలో ఏపీటీఎఫ్ నాయకులు

నెల్లూరు (టౌన్): ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఫ్యాప్టో ఆధ్వర్యంలో వచ్చేనెల 7న విజయవాడలో తలపెట్టిన ధర్నాను విజయవంతం చేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిరంజీవి పిలుపునిచ్చారు. నగరంలోని స్థానిక శ్రీవెంకటేశ్వర విద్యాలయంలో ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సురేంద్రరెడ్డి అధ్యక్షతన విస్తృత సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధ్యాయులకు బోధనేతర పనుల నుంచి విముక్తి కల్పించాలన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు 12వ పీఆర్సీ నియమించి 30 శాతం ఐఆర్‌ను ప్రకటించాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు దాటినా ఉపాధ్యాయులకు సంబంధించి ఒక్క సమస్య కూడా పరిష్కారం కాకపోవడం బాధాకరమన్నారు. పెండింగ్‌లో ఉన్న బకాయిలను వెంటనే విడుదల చేయడంతో పాటు ఉమ్మడి సర్వీసు రూల్స్‌ను అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ రాష్ట్ర సబ్ కమిటీ సభ్యుడు రియాజ్, జిల్లా ప్రధాన కార్యదర్శి పిచ్చిబాబు, రాష్ట్ర బాధ్యులు కృష్ణారెడ్డి, జుల్ఫీకర్అలీ, బాలత్రిపురసుందరి, జిల్లా బాధ్యులు బాలకృష్ణారెడ్డి, వెంకటేశ్వర్లురెడ్డి, కోటేశ్వరరావు, మురళీకృష్ణ, కరీం మొహిద్దీన్, విజయభారతి, సులోచన తదితరులు పాల్గొన్నారు.

శాంతి, సమానత్వంతోనే దేశాభివృద్ధి

నెల్లూరు (అర్బన్) : శాంతి, సహనత్వం వల్లనే ఏ దేశమైనా పురోగమిస్తుందని వాకర్స్ లాఫింగ్ క్లబ్ కార్యదర్శి, ఉద్యోగ సంఘాల జేఏసీ రాష్ట్ర మాజీ వైస్ చైర్మన్ రియాజ్ అహ్మద్ అన్నారు. అంతర్జాతీయ శాంతి దినోత్సవం సందర్భంగా స్థానిక వీఆర్సీ గ్రౌండ్‌లో వాకర్స్ లాఫింగ్ క్లబ్ ఆధ్వర్యంలో నాయకులు, విద్యార్థులు ఆదివారం శాంతిని కాంక్షిస్తూ పావురాలను వదిలారు. అనంతరం శాంతి, సౌభ్రాతృత్వం కోసం తమవంతు పాటుపడుతామని ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా రియాజ్ అహ్మద్ మాట్లాడుతూ ప్రపంచంలోనే శాంతిని కాంక్షించే దేశాల్లో భారత్ మొదటి స్థానంలో ఉండడం గర్వకారణమన్నారు. లాఫింగ్ క్లబ్ అధ్యక్షుడు బండారు సుబ్బారెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సంఘ కోశాధికారి జీఎస్ ప్రసాద్, వాకర్స్ రీజినల్ కౌన్సిలర్ ఎమ్వీరెడ్డి, ఆర్.వెంకటేశ్వరరావు, విజయకుమార్, రమణారెడ్డి, రవికుమార్, శివబాలసుబ్బారావు, యస్దాని, హరిప్రసాద్, తాజుద్దీన్, లక్ష్మణ్‌కుమార్‌రెడ్డి, వనిత వాకర్స్ సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన



తోటపల్లిగూడూరు: మండల కేంద్రంలోని మహిళా బ్యాంక్ ఆవరణలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. నెల్లూరులోని సత్య పీడియాట్రిక్స్, ఆర్థోపెడిక్స్ హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో దాదాపు 250 మంది రోగులకు వైద్యసేవలను అందించారు. కన్సల్టెంట్ ఆర్థోపెడిక్ సర్జన్ శ్రావణ్‌కుమార్, పురిటి, చిన్న పిల్లల వైద్యనిపుణులు మణి మృదుల, మహిళా బ్యాంక్ మేనేజర్ సుగుణ, స్థానికులు ముత్యాల శ్రీనివాసులు, ముత్యాల చిట్టిబాబు, తలమంచి నాగేశ్వరరావు, వరివేటి శివసాయి తదితరులు పాల్గొన్నారు.

బైక్ అదుపుతప్పి వ్యక్తికి గాయాలు

వెంకటాచలం: బైక్ అదుపుతప్పడంతో వ్యక్తి గాయపడిన ఘటన మండలంలోని కసుమూరులో ఆదివారం చోటుచేసుకుంది. వివరాలు.. నెల్లూరు నగరంలోని కిసాన్‌నగర్‌కు చెందిన ఖాదర్‌బాషా పని నిమిత్తం కసుమూరు వచ్చారు. ఆపై తిరిగెళ్తుండగా, మలుపు రోడ్డు వద్ద ఆటో అడ్డురావడంతో బైక్ అదుపుతప్పింది. క్షతగాత్రుడ్ని చికిత్స నిమిత్తం నెల్లూరు తరలించారు.

ఐక్య పోరాటాలతోనే బీసీలకు న్యాయం



మాట్లాడుతున్న నాగరాజు

మనుబోలు: ఐక్యంగా పోరాడితేనే బీసీలకు అన్ని రంగాల్లో న్యాయం లభిస్తుందని బీసీ నేత నాగరాజు పేర్కొన్నారు. స్థానిక పద్మావతి ఫంక్షన్ హాల్లో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీలకు అన్ని రంగాల్లో న్యాయం జరగడంలేదన్నారు. సంఘటితంగా లేకపోవడమే దీని కారణమని చెప్పారు. హక్కుల సాధన కోసం ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. మనుబోలు మండల కేంద్రంలో బీసీ కమ్యూనిటీ హాల్ నిర్మాణం, సావిత్రిబాయి పూలే విగ్రహ ఏర్పాట్లపై చర్చించారు. నేతలు లక్ష్మయ్య, జగదీష్, సురేష్, అంకయ్య తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి శరన్నవరాత్రి మహోత్సవాలు

పొదలకూరు: పట్టణంలోని కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో శరన్నవరాత్రి మహోత్సవాలను సోమవారం నుంచి అక్టోబర్ ఐదు వరకు నిర్వహించనున్నామని నిర్వాహకులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. విశేషాలంకారాల్లో అమ్మవారు దర్శనమివ్వనున్నారని వివరించారు. భక్తులు విశేషంగా తరలిరావాలని కోరారు.

- పట్టణంలోని శ్రీలక్ష్మీ గోదా సమేత వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో శరన్నవరాత్రి మహోత్సవాలను సోమవారం నుంచి అక్టోబరు రెండు వరకు నిర్వహించనున్నామని దేవస్థాన పాలక కమిటీ పేర్కొంది. అమ్మవారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలను రోజూ నిర్వహించనున్నామని తెలిపింది.
- **తోటపల్లిగూడూరు:** వరిగొండలో కొలువైన జ్వాలాముఖి ఆలయంలో సోమవారం నుంచి నిర్వహించనున్న శరన్నవరాత్రి మహోత్సవాలకు అన్ని ఏర్పాట్లను పూర్తి చేశామని ఈఓ తాతా శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన మాట్లాడారు. తొలి రోజు ఉదయం ఏడు గంటలకు ప్రత్యేక పూజలు, విశేషాభిషేకాలను నిర్వహించనున్నామని వివరించారు. భక్తులు తరలిరావాలని కోరారు.

వర్షాలతో అన్నదాతల ఆందోళన



గొలగమూడిలో ధాన్యం తడవకుండా పట్టలు కప్పుతున్న రైతులు

వెంకటాచలం: ఆరుగాలం శ్రమించి పండించిన పంట చేతికందే దశలో నిత్యం వర్షాలు పడతుండటంతో వెంకటాచలం మండలంలోని రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని తిక్కవరప్పాడు, కంటేపల్లి, ఇస్కపాళెం, అనికేపల్లి, గొలగమూడి, పుంజులూరుపాడు తదితర గ్రామాల్లో సుమారు మూడు వేల ఎకరాల్లో రెండో పంటను సాగు చేశారు. గొలగమూడి, అనికేపల్లి, ఇస్కపాళెం తదితర గ్రామాల్లో కోతలు ప్రస్తుతం ముమ్మరంగా జరుగుతున్నాయి. వారం నుంచి నిత్యం ఏదో సమయంలో వర్షం పడుతుండటంతో వీరు కలవరానికి గురవుతున్నారు. పంట నేలవాలిపోతుండటం, కోసిన ధాన్యం తడిసిపోతుండటంతో రైతులు దిగాలు చెందుతున్నారు.

కసుమూరులో భక్తుల ప్రార్థనలు



వెంకటాచలం: మండలంలోని కసుమూరులో గల మస్తాన్‌వలీ దర్గాను భక్తులు అధిక సంఖ్యలో ఆదివారం దర్శించుకున్నారు. గంధ మహోత్సవాలు శనివారంతో ముగిసినా, రద్దీ కొనసాగింది. మస్తాన్‌వలీ సమాధిని దర్శించుకొని టెంకాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు. ప్రత్యేక ప్రార్థనలను ముజావర్లు నిర్వహించారు.

ఘనంగా గురజాడ జయంతి



గురజాడ చిత్రపటానికి నివాళులర్పించిన ఉపాధ్యాయులు, విద్యార్థులు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: నగర పంచాయతీ పరిధిలోని గ్రంథాలయంలో గురజాడ అప్పారావు జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. తొలుత గురజాడ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు గండికోట సుధీర్‌కుమార్ మాట్లాడుతూ కన్యాశుల్కం, ముత్యాలసరాలు, దిద్దుబాటు తదితర రచనల ద్వారా గురజాడ సామాజిక చైతన్యం తీసుకొచ్చారన్నారు. గిడుగు రామ్మూర్తితో కలిసి వ్యవహారిక భాషోద్యమాన్ని ముందుండి నడిపిన వ్యక్తి గురజాడ అప్పారావు అని కొనియాడారు. నేటియువత ఆయన్ను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి అల్లాడి నరసింహారావు, ఉపాధ్యాయుడు తాటిపర్తి వెంకటేశ్వర్లు, ఎర్రయ్య, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



ఇందుకూరుపేట: యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని పతాంజలి యోగాసమితి రాష్ట్ర అధ్యక్షుడు బాలసుబ్రహ్మణ్యం గురూజీ అన్నారు. మండలంలోని మైపాడు సముద్ర తీరంలో ఉన్న శివాలయంలో ఆదివారం అవగాహన కార్యక్రమం జరిగింది. భారత్ స్వాభిమాన్ ట్రస్ట్ గౌరవాధ్యక్షుడు బి.విజయ్‌కుమార్‌రెడ్డి ప్రకృతి వైద్యం, యోగాథెరపి, హీలింగ్ మీద అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ట్రస్ట్ జిల్లా అధ్యక్షుడు పెంచలయ్య, పతాంజలి యోగా సమితి జిల్లా అధ్యక్షుడు రమణయ్య, ఉపాధ్యక్షుడు ముత్యాల రవీంద్ర పాల్గొన్నారు.

ఆవాజ్ మండల కమిటీ ఎన్నిక



నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మండలంలోని దామరమడుగు గ్రామంలో పుచ్చలపల్లి సుందరయ్య విజ్ఞాన భవన్‌లో ఆవాజ్ మండల రెండో మహాసభ ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆవాజ్ జిల్లా ఉపాధ్యక్షుడు జానీబాషా జెండా ఆవిష్కరణ చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో 11 మంది సభ్యులతో నూతన కమిటీని ఏర్పాటు చేశారు. మండలాధ్యక్షుడిగా జక్రియా, కార్యదర్శిగా మునీర్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో ఆవాజ్ జిల్లా కార్యదర్శి రషీద్, జిల్లా కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం



రక్తదాన శిబిరంలో మాట్లాడుతున్న డీఎస్పీ రామారావు

నెల్లూరు(అర్బన్): ఆపదలో ఉన్న వారికి రక్తదానం చేయడం ప్రాణదానంతో సమానమని మహిళా పోలీస్‌స్టేషన్ డీఎస్పీ సీహెచ్ రామారావు అన్నారు. జనతా ఫౌండేషన్ ఫౌండర్, న్యాయవాది దాసరి రాజేంద్రప్రసాద్‌గౌడ్ ఆధ్వర్యంలో నగరంలోని మద్రాస్ బస్టాండ్ వద్ద ఉన్న రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంకులో రక్తదాన శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని డీఎస్పీ రామారావు ప్రారంభించి, మాట్లాడారు. రక్తదానం చేయడం ఆరోగ్యానికి మేలు చేస్తుందన్నారు. ఆరోగ్యవంతులైన ప్రతిఒక్కరూ రక్తదానాన్ని కుటుంబ సాంప్రదాయంగా మార్చుకోవాలన్నారు. కాగా 60 మందికిపైగా ఫౌండేషన్ సభ్యులు, మిత్రులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో డాక్టర్ వెంకటసుబ్బారెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ నరేంద్ర, నరసింహ, కోటేశ్వరరావు, రాజా, మనోజ్, మురళి, అంకయ్య, భగవాన్‌రెడ్డి, శ్రీనాథ్, మాల్యాద్రి, శివ, రవి తదితరులు పాల్గొన్నారు.

ఆదమరిస్తే అంతే..



మనుబోలు: మండల పరిధిలోని బద్దెవోలు - కొలనకుదురు రోడ్డు మార్గంలో బద్దెవోలు, కట్టువపల్లి గ్రామాల మధ్య ఓ మలుపు వద్ద కల్వర్టు ప్రమాదకరంగా వుంది. ఇక్కడ కండలేరు ఉపకాలువపై ఉన్న కల్వర్టును చాలా కాలం క్రితం నిర్మించారు. ప్రస్తుతం పిట్టగోడ పూర్తిగా కూలిపోయింది. దీంతో ఈ మార్గంలో ప్రయాణించే వారు ఏమాత్రం అప్రమత్తంగా లేకపోయినా కాలువలో పడిపోయే ప్రమాదం ఉంది. గతంలో ఇక్కడ జరిగిన ప్రమాదాల్లో ఇద్దరు వాహనచోదకులు మృతి చెందగా, పదుల సంఖ్యలో గాయపడ్డ ఘటనలున్నాయి. అధికారులు స్పందించి కల్వర్టుకు పిట్టగోడను నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

మందుబాబులకు అడ్డాగా..

- దుస్థితిలో పాత తహసీల్దార్ కార్యాలయ భవనం



ఖాళీగా వదిలేసిన పాత తహసీల్దార్ కార్యాలయ భవనం

కొడవలూరు: మండల కేంద్రంలోని పాత తహసీల్దార్ కార్యాలయ భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో మందుబాబులకు అడ్డాగా మారింది. మండల స్థాయిలో ఎంతో ప్రాధాన్యమున్న తహసీల్దార్ కార్యాలయ భవనం శిథిలావస్థకు చేరడంతో ఆ భవనాన్ని వదిలేసి బ్రిటీషు కాలంలో నిర్మించిన ఇరిగేషన్ అతిథి గృహానికి కార్యాలయాన్ని మార్చారు. ఇలా మార్పు చేసి రెండేళ్లు గడిచినా ఆ భవనం స్థానంలో మరో నిర్మాణం చేపట్టలేదు. దీంతో ఆ భవనంలోని తలుపులు, కిటికీలను దుండగులు అపహరించుకుపోయారు. రాత్రయితే మందుబాబులు తిష్ట వేస్తున్నారు. చీకటి కార్యకలాపాలకు ఆ భవనం కేంద్రంగా మారిందన్న ప్రచారం గ్రామంలో ముమ్మరంగా సాగుతోంది. ప్రస్తుతం తహసీల్దార్ కార్యాలయం నడుస్తున్న ఇరిగేషన్ అతిథి గృహ భవనం కూడా శిథిలావస్థలోనే ఉంది. ఈ భవనం ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. ఈ క్రమంలో శిథిల తహసీల్దార్ భవనాన్ని కూల్చి కొత్తగా నిర్మించుకోవాల్సిన అవసరం ఉంది. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలు కూడా పంపి ఉన్నారు. కానీ నిధుల మంజూరులో తీవ్ర జాప్యం జరుగుతోంది. ప్రస్తుతం తహసీల్దార్ కార్యాలయం నడుస్తున్న భవనం కూలే వరకు నిధులు మంజూరు చేసేలా లేరన్న అభిప్రాయం అధికారిక వర్గాల్లోనే వ్యక్తమవుతోంది. మరో పక్క ఖాళీగా వదిలేసి ఉన్న శిథిల భవనం పరిస్థితి ఇక అంతేనా అనే అనుమానాలు రేకెత్తుతున్నాయి. ఈ పరిస్థితిని దృష్టిలో పెట్టుకొని జిల్లా ఉన్నతాధికారులు స్పందించి భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాల్సిన అవసరం ఉంది.



కోడూరులో సందడి

పర్యాటకులతో కోడూరు బీచ్‌లో ఆదివారం కోలాహలం నెలకొంది. పాఠశాలలకు దసరా సెలవులు ప్రారంభంకావడంతో వివిధ ప్రాంతాల నుంచి భారీగా తరలివచ్చారు. గంటల కొద్దీ సముద్ర స్నానాలతో సరదాగా గడిపారు. ఉదయం పదికి ప్రారంభమైన రాకపోకలు సాయంత్రం ఆరు వరకు కొనసాగాయి. ఎలాంటి ఘటనలు చోటుచేసుకోండా బీచ్‌లో బందోబస్తును పోలీసులు ఏర్పాటు చేశారు.

– తోటపల్లిగూడూరు